W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

28-3-2026 వరంగల్





### అవగాహనతో రోడ్డు ప్రమాదాల
## నివారణ సాధ్యం



వరంగల్ జిల్లా జక్కలొద్ది గ్రామంలోని టీజీఎంఆర్ ఈఐఎస్ పాఠశాలలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై సమగ్ర అవగాహన కల్పించారు. 03



## భోజనంలో బల్లి విద్యార్థుల ఆందోళన

హనుమకొండ భీమారం ప్రాంతంలోని ఒక ప్రైవేట్ హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుకుంది. ఎస్.వీ.ఎస్ కళాశాల సమీపంలో ఉన్న శశాంక బాయ్స్ హాస్టల్‌లో గురువారం విద్యార్థులకు వడ్డించిన భోజనంలో బల్లి రావడంతో ఒక్కసారిగా కలకలం సృష్టించింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 05



## రెడ్ నోటీసులు జారీ చేయండి

గ్రేటర్ వరంగల్ నగరంలోని బడా బకాయి దారులకు తక్షణమే రెడ్ నోటీసులు అందజేసి పన్ను వసూళ్లు చేపట్టాలని హన్మకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు.

02




# పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణకు చర్యలు

- ఇంధన ధరలు తగ్గే అవకాశం?
- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలపై ఎక్సైజ్ సుంకం సడలింపు
- పెట్రోల్ పై రూ.13 నుంచి రూ. 3 కు తగ్గింపు
- డీజిల్ పై పూర్తిగా సుంకం ఎత్తివేత

మహా వరంగల్ బ్యూరో

గత కొంతకాలంగా అంతర్జాతీయ మార్కెట్ లో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్పై విధిస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పెట్రోల్పై లీటరుకు ఎక్సైజ్ సుంకాన్ని రూ.13 నుంచి రూ. 3కు తగ్గించగా, డీజిల్పై ఉన్న రూ.10 సుంకాన్ని కేంద్రం పూర్తిగా తొలగించింది. ప్రభుత్వ నిర్ణయంతో వాహనదారుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయన్న ఆశలు చిగురిస్తున్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో వెంటనే ధరలు తగ్గే అవకాశం తక్కువని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

05



## కాంట్రాక్టర్‌పై ఏపీఏవో దాడి

జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్ లో ఓ అధికారి వీరంగం సృష్టించాడు. బిల్లుల చెల్లించాలని అడిగి నందుకు ఆగ్రహంతో కాంట్రాక్టర్ పై బూతులు ట్టుకుంటూ దాడి చేశాడు. విచక్షణ కోల్పోయి బూతులతో విరుచుకుపడ్డాడు. 03



## జర్నలిస్టు పూజారి విజయ్ మృతి

గత నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిన సీనియర్ జర్నలిస్ట్ పూజారి విజయ్ కుమార్ గౌడ్ (51) చివరకు శవమై తేలారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన విజయ్, ప్రస్తుతం హనుమకొండలోని కృష్ణ కాలనీలో నివాసముంటున్నారు. 05

# బడా బకాయి దారులకు రెడ్ నోటీసులు జారీ చేయండి

## హన్మకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ .. ఆస్తిపన్ను పై వడ్డీ మాఫీ లేదు

**మహా వరంగల్ బ్యూరో:** గ్రేటర్ వరంగల్ నగరంలోని బడా బకాయి దారులకు తక్షణమే రెడ్ నోటీసులు అందజేసి పన్ను వసూళ్లు చేపట్టాలని హన్మకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగర పరిధి లోని 6, 7, 8 డివిజన్ లలో పన్ను వసూళ్ల ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసి పన్ను వసూళ్ల తీరును పరిశీలించి నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకోవడానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కలెక్టర్ పన్ను వసూళ్ల విధానాన్ని సంబంధిత వార్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్ను వడ్డీ మాఫీ లేదని స్పష్టం చేశారు. నగర ప్రజలు ఈ నెల 31వ తేదీలోపు పన్నులు చెల్లించి జరి మానాల బారిన పడకుండా ఉండాలని, ఇంకా నాలుగురోజుల సమయం ఉందని, పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు కేవలం 4 రోజులు మాత్రమే గడువు ఉన్నందున పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఇంటి నుండి వసూళ్లు చేపట్టాలని, ముఖ్యంగా 400 మంది బడా బకాయి దారులకు రెడ్ నోటీసులు అందజేసి వెంటనే వారి నుండి పన్నులు వసూళు



చేపట్టేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఈ ఈ మహేందర్ రెవెన్యూ అధికారి బాకం సంతోష్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, వార్డ్ ఆఫీసర్ క్రాంతి, బిల్ కలెక్టర్లు శివ సాయి, అజయ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి వేడుకల్లో ఎర్రబెల్లి స్వర్ణ





**మహా వరంగల్ బ్యూరో:** హనుమకొండ బాలసముద్రంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం లో శ్రీ రామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో భాగంగా భోజనాలను వడ్డిం చారు. దివ్యాంగులతో స్నేహ పూర్వకంగా మెదిలి , వారికి ధైర్యం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా మాట్లాడారు. అనంతరం హనుమ కొండ ఎక్సైజ్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ-వరదరాజేశ్వర్ రావు దంపతులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆర్చకులు నిర్వహించిన వేద మంత్రోచ్ఛారణల మధ్య శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా కొనసాగాయి. అనంతరం వారు మాట్లాడుతూ, శ్రీ రామనవమి పర్వదినం ప్రతి ఇంటిలో ఆనందం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని, శ్రీరామచంద్రుని కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరి పై ఎల్లప్పుడూ ఉండాలని మహిళలు ఆర్థికంగా ఎదిగి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సమాజంలో ధర్మం, నీతి, సత్యం విలువలు పెంపొందాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# అవగాహనతో రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద






**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ జిల్లా జక్కలోద్ధి గ్రామంలోని టీజీఎంఆర్ ఈఐఎస్ పాఠశాలలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల పై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై సమగ్ర అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, పాదచారుల భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్ ను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే ఈ అలవాట్లు పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో సురక్షిత సమాజ నిర్మాణానికి తోడ్పడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్స్ ను పరిశీలించిన కలెక్టర్, అవసరమైతే అదనంగా కంప్లైంట్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిని ఆదేశించారు. విద్యార్థులు తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేయడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రతపై విలువైన సూచనలు తెలుసుకున్నారు. అనంతరం ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ రోడ్డు భద్రతను ప్రోత్సహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యా రాణి, ఆర్డీవో వరంగల్ సుమ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, డీబీసీడీఓ పుష్పలత, డీఎస్సీడీ ఓ భాగ్యలక్ష్మి, డీఎస్సిడిఓ, ఎంపీఐ జయపాల్ రెడ్డి, మమ్నూర్ ఎస్ఐ శ్రీకాంత్, తహసీల్దార్ ఇక్బాల్, ప్రిన్సిపల్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# అసభ్య పదజాలంతో కాంట్రాక్టర్‌పై ఏపీఏవో దాడి

**మహా వరంగల్ బ్యూరో:** జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్ లో ఓ అధికారి వీరంగం సృష్టించాడు. బిల్లుల చెల్లించాలని అడిగి నందుకు ఆగ్రహంతో కాంట్రాక్టర్ పై బూతులు తిట్టుకుంటూ దాడి చేశాడు. విచక్షణ కోల్పోయి బూతులతో విరుచుకుపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బిల్లులు క్లియర్ చేయాలని కోరేందుకు వీరేందర్ అనే కాంట్రాక్టర్ గురువారం కలెక్టరేట్ లోని ఏపీఏఓ ఫణి భూషణ కశ్యప వద్దకు వెళ్లాడు. గతంలో బిల్లుల విషయంలో తనను వేధిస్తున్నారని వీరేందర్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకున్న అధికారి ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ విషయంపై నిల దీయగా అధికారి సహనం కోల్పోయి వీరేందర్ పై దాడికి దిగాడు. టేబుల్ మీద ఉన్న వస్తువులతో బలంగా కొట్టడంతో కాంట్రాక్టర్ ముఖం పై తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు వెంటనే భూపాలపల్లి పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసులను ఆశ్రయించారు. తన పై దాడి చేసి గాయపరిచిన ఏపీఏఓ ఫణి భూషణ కశ్యప పై ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిం చారు. కలెక్టరేట్ వంటి అత్యున్నత కార్యాలయంలో బాధ్య తాయుతమైన పదవిలో ఉండి.. కాంట్రాక్టర్లను ఇలా వేధించడం, దాడులకు పాల్పడటం పై తోటి ఉద్యోగులు సైతం విస్మయం వ్యక్తం చేశారు. సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నాడు.





# కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

## కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**మహా వరంగల్ బ్యూరో:** మద్యానికి బానిసైన వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మచ్చాపురం లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గీసుగొండ ఇన్స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మచ్చాపురం గ్రామానికి చెందిన మొగుసాని లక్ష్మణ్ (37) వీఆర్ఏ గత కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవలు పడుతూ బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నాడు. గత నాలుగు రోజులుగా ఇంటిలో కలహాలు కొనసాగుతుండగా,శుక్రవారం ఉదయం అతని తండ్రి మొగుసాని కనకయ్య, భార్య కలిసి ప్రవర్తన మార్చు కోవాలని మందలించారు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో ఉన్న లక్ష్మణ్ అదే రోజు మధ్యాహ్నం గంగదేవిపల్లి చెరువులో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన పై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

# ముగిసిన శ్రీ భద్రకాళి వసంత నవరాత్ర మహోత్సవాలు

- భద్రకాళి అమ్మవారికి లక్షపుష్పార్చన
- అమ్మవారికి పంచ లోహాల పాద పద్మాలను సమర్పించిన దాతలు
- పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రముఖులు







**మహా వరంగల్ బ్యూరో:** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో వసంత నవరాత్ర మహోత్సవాలు తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. తొమ్మిదవ రోజు కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం జరుపడిన పిమ్మట కల్పోక్త ప్రకారం వసంత నవరాత్ర ఉత్సవాల సందర్భంగా జరుపవలసిన విశేష జపహూమార్చనాభిషేకములు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గులాబీ పూలతో లక్షపుష్పార్చన జరిపి అమ్మవారికి నివేదనలు సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. అమ్మవారికి నిర్వహించిన లక్ష పుష్పార్చన కు ఉభయ దాతలుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి- నీలిమ దంపతుల సౌజన్యంతో నిర్వహించబడింది. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి కి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ధర్మకర్తల మండలి చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్త గాండ్ల స్రవంతి, పాలడుగుల ఆంజనేయులు, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. తొలుతగా అమ్మవారికి పూజాదికములు నిర్వహించి నాయిని రాజేందర్ రెడ్డికి లక్షపుష్పార్చన క్రతువు నిర్వహింజేశారు. అనంతరం అమ్మవారికి పుష్పాలను వెదురుబుట్టలలో తీసుకొని అర్చన నిర్వహింపజేశారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ రోజు శుక్రవారం కూడా కావడంతో భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. శుక్రవారం శ్రీరామ నవమి అట్లాగే దశమహావిద్యలలో జగన్మాత యొక్క రెండవ అవతారమైన తారా జన్మోత్సవం కృష్ణస్తుకాళికాసాక్షాత్ రామమూర్తిశ్చతారిని అని శాక్త్యాగమం చెబుతోంది అనగా కృష్ణుడు సాక్షాత్తు కాళికయని, రాముడు తార అని అర్థం. ఈ వసంత నవరాత్రులలో తొమ్మిది రోజులు అమ్మవారి నిత్యాహ్నికం, శ్రీ చక్రార్చనతోపాటు తారా సపర్యాక్రమం విశేషంగా నిర్వర్తించబడింది. భద్రకాళీ క్షేత్రంలోని హనుమదాలయంలోని హనుమత్సితారామలక్ష్మణులకు హనుమదాలయ అర్చకులు బ్రహ్మశ్రీ పాకాల సంతోష్ శర్మ విశేష అభిషేక, అర్చనాదులు నిర్వహించారు. అనంతరం శ్రీరామ జన్మోత్సవం నిర్వహింపబడి శ్రీరామ వరివస్యా చండీ హవనం, మహాపూర్ణాహుతి నిర్వహింపబడటంతో గత తొమ్మిది రోజులుగా ఎంతో మహా వైభవంగా పవిత్రంగా నిర్వహింపబడిన వసంత నవరాత మహోరీత్సవముల పూర్తియ్యాయి. సాయంత్రం 7 00 గంటలకు శ్రీ సీతారామ కళ్యాణం అత్యంత వైభవోపేతంగా కన్నుల పండుగగా ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో దేవాలయ స్నపన మండపంలో నిర్వహించారు. ఈ కళ్యాణంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈ రోజుతో వసంత నవరాత్ర మహోత్సవములు ముగిశాయని ఆలయ ఈఓ రామల సునీత తెలిపారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులలో తెలంగాణా శాసనమండలి సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వ్యవసాయ కార్పోరేషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఉన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కు ఆలయ ధర్మకర్తలు ధర్మకర్తలు, తొనుపునూరి వీరన్న, జారతి వెంకటేశ్వర్లు, తొగరు క్రాంతి, మూగా శ్రీనివాసరావులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజానంతరం మహా మండపంలో ఎమ్మెల్సీ శ్రీనివాస రెడ్డి కి మహ దాశీర్వచనం నిర్వహించారు. ఆలయంలో ఎండ తాకిడికి భక్తుల ఇబ్బందిని గమనించిన శ్రీనివాస్ రెడ్డి వెంటనే శాశ్వత ప్రాతిపదికన జర్మన్ పెండల్స్ టెంట్లు వేయించమని అందుకు అయ్యే ఖర్చు పదిలక్షల



రూపాయలు తమ విరాళం తో జరిపించమని ఈ సందర్భంగా ధర్మకర్తలను కోరారు. ఇందుకు ధర్మకర్తలు 10 రోజులలో పని పూర్తి చేయిస్తామని శ్రీనివాసరెడ్డికి హామి ఇచ్చారు. ఆలయంలో భక్తులు స్వయంగా కుంకుమార్చనలు విశేషంగా లక్ష కుంకుమార్చనలు స్వయంగా జరుపుకోవడానికి వీలుగా అమ్మవారి యొక్క పాదపద్మాలను పంచలోహాలతో తమిళనాడు లో చేయించి తన పరివారం విరాళంగా ప్రముఖ వ్యాపారవేత్త బకరాజు చంద్రశేఖర్రావు- రాజశ్రీ దంపతులు ఆలయానికి సమర్పించారు. వాటికి అగ్యుత్తారణాదికములు జరిపించి పాదుకా ప్రతిష్ఠా సుప్రసిద్ధ ఆగమ శాస్త్ర పండితులు గణేశ ఆత్రేయ శర్మ నేతృత్వంలో జరిపించారు. అనంతరం ఆలయ అధికారులకు అందజేశారు. గత తొమ్మిది రోజులుగా వసంత నవరాత్రి మహోత్సవాలు కవర్ చేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారికి ఆలయ ఈవో రామల సునీత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# పెట్రోల్, డీజిల్ ధరల నియంత్రణకు చర్యలు

- ఇంధన ధరలు తగ్గే అవకాశం?
- కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలపై ఎక్సైజ్ సుంకం సడలింపు
- పెట్రోల్ పై రూ.13 నుంచి రూ. 3 కు తగ్గింపు

**మహా వరంగల్ బ్యూరో:** గత కొంతకాలంగా అంతర్జాతీయ మార్కెట్ లో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్పై విధిస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పెట్రోల్పై లీటరుకు ఎక్సైజ్ సుంకాన్ని రూ. 13 నుంచి రూ. 3 కు తగ్గించగా, డీజిల్పై ఉన్న రూ. 10 సుంకాన్ని కేంద్రం పూర్తిగా తొలగించింది. ప్రభుత్వ నిర్ణయంతో వాహనదారుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయన్న ఆశలు చిగురిస్తున్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో వెంటనే ధరలు తగ్గే అవకాశం తక్కువని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. గత కొన్ని వారాలుగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినప్పటికీ, దేశీయ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్పీసీఎల్ ఆ భారాన్ని వినియోగ దారులపై వేయకుండా నిరోధించాయి. ఈ క్రమంలో ప్రస్తుతం లీటర్ పెట్రోల్పై రూ. 24, డీజిల్పై రూ. 30 వరకు ఈ కంపెనీలు నష్ట పోతున్నట్లు సమాచారం. ప్రభుత్వం తగ్గించిన ఈ ఎక్సైజ్ సుంకాన్ని ఆయిల్ కంపెనీలు తమ పాత నష్టాలను పూడ్చు కోవడానికి లేదా భవిష్యత్తులో ధరలు మరింత పెరగకుండా అడ్డుకోవడానికి బఫర్గా ఉపయోగించుకునే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం పన్నులు తగ్గించినా, ఆయిల్ కంపెనీల ఆర్థిక పరిస్థితి కారణంగా రిటైల్ అవుట్లెట్లలో వినియోగదారులు కొనుగోలు చేసే ధరల్లో తక్షణ మార్పులు ఉండకపోవచ్చు. కంపెనీలు తమ నష్టాలను సర్దుబాటు చేసుకున్న తర్వాతే ధరల తగ్గింపు ప్రయోజనాన్ని సామాన్యులకు బదిలీ చేసే అవకాశం ఉంది. దీంతో కేంద్రం సుంకాలు తగ్గించినప్పటికీ, సామాన్యుడి జేబుకు తక్షణ ఉపశమనం లభించడం కష్టమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# ఏప్రిల్ 6లోగా అప్లై చేసుకోండి

## జర్నలిస్టుల అక్రెడిటేషన్లపై ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక

**మహా వరంగల్ బ్యూరో:** రాష్ట్రంలోని జర్నలిస్టులు అక్రెడిటే షన్ కోసం ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక తెలిపారు. జర్నలిస్టులు తమ యాజమాన్యాలు ఇచ్చే సిఫార్సు లేఖ, ఇతర అర్హతల లేఖలను జత చేస్తూ అప్లికే షనన్ను పూర్తి చేసి అప్లోడ్ చేయాలని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయనున్న ట్లుగా ఆమె వివరించారు. ఏప్రిల్ రెండో వారంలో కమిటీ మరోసారి సమావేశమై అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారందరికీ అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ ఇప్పటికే రెండుసార్లు సమావేశమైందని జీవో అమలు, విధి విధానాలపై చర్చించి అర్హులైన ప్రతి జర్నలిస్టులకు సమాన అవకాశాలు కల్పించేలా ప్రక్రియను కొనసాగిస్తామని చెప్పారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టుల వివరాలను కమిటీ సమీక్షించి, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన వారికి అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

# జర్నలిస్టు పూజారి విజయ్ మృతి



**మహా వరంగల్ బ్యూరో:** గత నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిన సీనియర్ జర్నలిస్ట్ పూజారి విజయ్ కుమార్ గౌడ్ (51) చివరకు శవమై తేలారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామానికి చెందిన విజయ్, ప్రస్తుతం హనుమకొండ లోని కృష్ణ కాలనీలో నివాసముంటున్నారు. శుక్రవారం అక్కంపేట సమీపంలోని కేసీ కెనాల్లో మృతదేహాన్ని పోలీసులు గుర్తించి వెలికితీశారు. విజయ్ కుమార్ మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అదే రోజు ఉదయం 10 30 గంటల ప్రాంతంలో ఆయన మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు, స్నేహితులు అన్ని చోట్లా వెతికినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. ఆయన ప్రయాణించిన బ్లూ కలర్ గ్లామర్ బైక్ (టీఎస్ 03 ఈ యు 2731) కూడా ఎక్కడా కనిపించకపోవడంతో బుధవారం కుటుంబ సభ్యులు కేయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం అక్కంపేట కేసీ కెనాల్ వద్ద ఒక మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. అది విజయ్ కుమార్ మృతదేహమే అని నిర్ధారించిన పోలీసులు, మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. విజయ్ కుమార్ మృతితో ఆయన స్వగ్రామం గట్లకానిపర్తిలోనూ, హనుమకొండ జర్నలిస్ట్ వర్గాల్లోనూ తీవ్ర విషాదం నెలకొంది. శుక్రవారం రాత్రి అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో నిర్వహించారు. ఆయన మృతిపై కేయూ పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతున్నారు.

# భోజనంలో బల్లి విద్యార్థుల ఆందోళన

**మహా వరంగల్ బ్యూరో:** హనుమకొండ భీమారం ప్రాంతంలోని ఒక ప్రైవేట్ హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం పరాకాష్టకు చేరుకుంది. ఎస్.వీ.ఎస్ కళాశాల సమీపంలో ఉన్న శశాంక బాయ్స్ హాస్టల్ లో గురువారం విద్యార్థులకు వడ్డించిన భోజనంలో బల్లి రావడంతో ఒక్కసారిగా కలకలం సృష్టించింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భోజనం చేస్తున్న సమయంలో పప్పులో బల్లి కనిపించడంతో విద్యార్థులు షాక్కు గురయ్యారు. విషపూరిత ఆహారం తింటే తమ ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని నిర్వాహకులను నిలదీశారు. అయితే, హాస్టల్ నిర్వాహకులు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా చూసేందుకు, విద్యార్థులను నయానో భయానో సముదాయించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. నిర్వాహకుల మాటలను తిరస్కరించిన విద్యార్థులు, అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. విద్యార్థుల ఫిర్యాదు మేరకు శుక్రవారం హాస్టల్కు చేరుకున్న ఫుడ్ ఇన్స్పెక్టర్, వంట గదిని, ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ అపరిశుభ్ర వాతావరణం ఉండటం, నిబంధనలు పాటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు, రూ. 15,000 జరిమానా విధించినట్లు సమాచారం.




# వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ తూర్పు నియోజకవర్గం కరీంబాద్ లో ఆటో స్టాండ్ వద్ద అలాగే హనుమాన్ దేవాలయంలో తారకరామ పరపతి సంఘం పరిధిలోని హనుమాన్ దేవాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ మహోత్సవాల కార్యక్రమాల్లో గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు.అనంతరం 18వ డివిజన్ లో శ్రీ పంచముఖ నాగవేశ్వర దేవాలయం తో పాటు 26, 25 వ డివిజన్ల లోని శ్రీ శివ సంజీవ ఆంజనేయ స్వామి దేవాలయం ఎల్లం బజార్ లో శ్రీరామ మేరు భజన మందిరంలో నిర్వహించిన శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనేక మంది భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

